
# ప్రేక్షక చక్రవర్తి

యం.యస్. సూర్యనారాయణ



ఎప్పట్లాగే చక్రవర్తి నిద్రలేచాడు.

అతన్తోపాటే అతని కుర్చీ కూడా కళ్ళు నులుముకుంటూ నిద్రలేచింది.

చక్రవర్తి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని, అలవాటుగా కుర్చీలో కూర్చున్నాడు.

అతని కళ్ళముందు ఉదయపు ప్రసారాలు ప్రారంభమయ్యాయి.

తను కూర్చున్న చోటునుంచి పెరటి దృశ్యం కనిపిస్తోంది. విశాలమైన పెరట్లో ఒక పక్కగా పారిజాత వృక్షం. దానికి కాస్త దూరంగా వెడల్పాటి సిమ్మెంటు చెప్టా. చెప్టా మధ్యలో బోరింగ్ పంపు. పంపు దగ్గర పారిజాతం.

రాత్రి పూసిన పారిజాతాలు చెట్టు మొదట్లో పడి ఉన్నాయి. సిమ్మెంటు చెప్టాలో నిలబడి, పారిజాతం నీళ్ళుతోడుతోంది. గోలేలు నింపుతోంది. బోరింగ్ పంపు రెక్క పైకీ, కిందకీ భారంగా కదుల్తోంది. సముద్రంలో నావ నడిపినట్టుగా.... వేగంగా తెడ్డు వేసినట్టు ..... పంపు రెక్కని కదుపుతోందామె.

చక్రవర్తి పెరటి దృశ్యాన్ని తదేకంగా చూస్తున్నాడు.

ఆ దృశ్యం చూస్తున్నకొద్దీ అతనికి అందులో ఏదో కొత్తదనం కనిపిస్తోంది. ఒక రొటీన్ సన్నివేశం అవాళ వెరయిటీగా నడుస్తోంది!

బోరింగ్ పంపు రెక్క బదులు ..... 'పెళ్ళాం' రెక్క పైకీ, కిందకీ ఆడుతోంది! చక్రవర్తి కళ్ళు నులుముకుని చూశాడు.

ఈసారి స్పష్టంగా కనిపిస్తోంది. నిజమే పారిజాతం సరిగ్గా తన రెక్కనే బోరింగ్ పంప్‌కి అమర్చింది! పారిజాతం చెయ్యి పైకీ, కిందకీ కదుల్తూ, పాతాళగంగని తోడిపోస్తోంది. గోలేల్లోకి నీళ్ళుతోడ్డం పూర్తయ్యాక, పారిజాతం పాత్రలు శుభ్రం చెయ్యడం మొదలుపెట్టింది.

అవ్వేళ్టి పొద్దుటి ప్రసారాల్లో కొత్తరకంగా కనిపించిన పాత పెరటి దృశ్యాన్ని చాలాసేపు చూశాక, చక్రవర్తికి 'బోరు' కొట్టింది! అతని కళ్ళు బరువెక్కాయి! "ఇదిగో! కాఫీ ఇస్తావా?" చక్రవర్తి చిరాగ్గా కుర్చీలోంచి కేక పెట్టాడు.



అంతదాకా చెమట చిత్తడిలో తడిసిన పారిజాతం మౌనంగా తను శుభ్రం చేసిన పాత్రలని మూడు దఫాలుగా వంటింట్లోకి చేర్చి, స్టౌ వెలిగించింది. ఈసారి చక్రవర్తి కుర్చీ వీధి అరుగుమీదకి మారింది. లోపల్నుంచి కాఫీ వచ్చింది. మెల్లగా సిప్ చేస్తూ రోడ్డుపైకి దృష్టి సారించాడు.

సన్నివేశం ఏదైనా కావచ్చు. సమయం .... సందర్భం ఏలాంటిదైనా కావచ్చు. చక్రవర్తికి తన కుర్చీలో కూర్చుని 'చూడ్డం' అంటేనే ఇష్టం. ఒక టీవి ముందో .... సినిమా తెరముందో..... నాటకం ముందో .... సుఖాశీనుడైనట్టు ..... జరిగే సన్నివేశాల్ని కంటినోటితో చప్పరించే పద్ధతదే తను మెచ్చుకునేది. అతనికి ప్రపంచంలో అణువణువూ ప్రదర్శనలాగే అనిపిస్తుంది.

ఒక వాస్తవం ముందు.... ఒక సంఘర్షణ ముందు .... ఒక యుద్ధం ముందు .... అతను కుర్చీవేసుకుని కూర్చుంటాడు. అతన్ని అత్యంత సౌకర్యవంతంగా .... మెత్తగా ... తనలో ఇముడ్చుకుంటుంది కుర్చీ! కుర్చీ అతని ప్రాణం. ఆ కుర్చీని కాపాడుకోవడం కోసమే అతను అహర్నిశలూ తంటాలు పడుతూంటాడు. తన కుర్చీని రక్షించుకోవడానికి అనూహ్యమైన ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వస్తుందని చక్రవర్తికి బాగా తెలుసు.

తెరముందైతే - కాళ్ళు చాపుకుని రిలాక్సింగ్‌గా కూర్చునే వీలుంటుంది. కానీ జీవితం ముందు అట్లాంటి అవకాశం బొత్తిగా తక్కువ! జీవితంలో ఎదురయ్యే వాస్తవాలని చూస్తూ 'కూర్చోడానికి' ఎంతో ప్రతిభ కావాలి. చాకచక్యం కావాలి. బహుశా, అన్ని స్థలాల్లోనూ కుర్చీ పట్టే చోటు ఉండక పోవచ్చు! అటువంటప్పుడు తప్పనిసరిగా 'కొంచెం' ఒళ్ళు వంచాలి! జీవితంలో ఎదురయ్యే కఠిన సన్నివేశాల ముందు ...'కొద్దిగా' నిలబడాలి! కాస్త నడవాలి! అవసరాన్ని బట్టీ.... పరిగెట్టాలి. ....గెంతాలి..... దూకాలి......

అయితే - ఎవరికీ ఎటువంటి సందేహమూ అవసరం లేదు.

చక్రవర్తి ఒక ఉత్తమ శ్రేణికి చెందిన ప్రేక్షక మహాశయుడు.

తన స్థానాన్ని ఎట్లా కాపాడుకోవాలో అతనికి అద్భుతంగా తెలుసు.

మజాకా అనుకుంటున్నారా? అతని దగ్గర అపూర్వమైన కుర్చీ ఉంది. ఏమనుకుంటున్నారో! కర్ణుడి కవచకుండలాల మాదిరిగా .... చక్రవర్తికి 'కుర్చీ' విలువైన ఆంతరంగిక శరీరభాగం! అటువంటి అపూర్వమైన అంగం కలిగిన చక్రవర్తి - తన ఇంట్లో ఉదయమే ప్రసారమయ్యే పెరటి దృశ్యం దగ్గర్నుంచీ - ఎటువంటి సన్నివేశాలనైనా 'చూస్తూ' ఉండగలడు. అతను నడూస్తూంటే అతన్లోంచి ప్రేక్షకత్వం తొణికిసలాడుతోంటుంది. దారిపొడుగునా - తను నడిచినంత మేరా చూపుల్ని వెదచల్లుతూంటాడు!

చక్రవర్తి వీధిలో నడుస్తూంటాడు.

అతని కళ్ళ ముందు నుంచీ రోడ్డు .... చలన చిత్రంలా కదిలిపోతూంటుంది. జనం రద్దీతో కిటకిటలాడే ఆ చౌరాస్తాలో హఠాత్తుగా భయంకరమైన విస్ఫోటనం! చౌరాస్తా దద్దరిల్లిపోతుంది. దిక్కులు పిక్కటిల్లి పోతాయి.

కళ్ళముందు శవాలు గాల్లోకి లేస్తాయి.

తునాతనకలైపోయిన అవయవాలు చెల్లా చెదురైపోతాయి.

పసిపిల్లలు.... స్త్రీలు ..... వృద్ధులు ... తుత్తునియలై ... నిలువెత్తు మానవత్వం భగ్గున మండి ... మాడి .... మసై ..... మసై....

ఎక్కణ్ణుంచో ఒక వికటాట్టహాసం .. రీమోట్ కంట్రోల బటన్ల మీంచి గెంతుకుంటూ వ్యాపించినప్పుడు --- అప్పుడు కూడా .... అతను చూస్తుంటాడు! తన కళ్ళని కత్తిరించి... ఓ గోడకి అతికించి ... చక్రవర్తి తన సెల్యులాయిడ్ దృక్కులు సారించి ఉంటాడు!

తెరకీ జీవితానికీ తేడా చెరిపేసిన చక్రవర్తి అట్లా నడుస్తూనే వుంటాడు. నాలుగు మహానగరాల్లోనూ ... నాలుగు మహాశ్మశానాలు దర్శనమిస్తాయి! "చార్ మహానగర్ మే .. ఆజ్‌కీ బమ్ విస్ఫోటన్ ఇస్ ప్రకార్ హై"

"రాష్ట్రంలో నాలుగు ముఖ్య పట్టణాల్లోనూ ఈ రోజు నమోదైన బాంబు పేలుళ్ళు"

నమస్కార్! నమస్కారం! ఆదాబర్సే!

నిజానికి చక్రవర్తి కులాసాగ కూర్చుని అనేకం చూశాడు. పంతొమ్మిది వందల నలభై ఏడు ఆగస్టు పదిహేను చూశాడు. మైదానాల్లో అనేక బహిరంగ సభలు చూశాడు. ఎన్నికల ప్రచారాలు చూశాడు. అప్పట్లో.... సినిమాహాళ్ళల్లో న్యూస్‌రీళ్ళు ఆసక్తిగా చూశాడు. న్యూస్ రీళ్ళలో ఒప్పందాలు చూశాడు. ఫైళ్ళు మార్చుకోడం చూశాడు.

తాజాగా పాదయాత్రలు చూస్తున్నాడు. రథయాత్రలు చూస్తున్నాడు.

ఘనమైన శవయాత్రలు కూడా రోజూ తంచనుగా చూస్తున్నాడు.

ఉన్నతమైన సాంకేతిక విలువలతో 'అంతా' రంగులో చూస్తున్నాడు. ముఖ్యంగా వ్యాపారస్తులు స్పాన్సర్ చేసిన మేజిక్ షోలంటే చక్రవర్తికి భలే ఇష్టం!

ఖద్దరు దుస్తుల్లో .... టోపీ సవరించుకుంటూ ... నాయకుడు

తన షో కొనసాగిస్తూంటాడు.

ఆకలీ ... నిరుద్యోగం .... దరిద్రం... మొదలైన నల్లటి పూలు నిండిన ఫ్లవర్ వాజ్‌ని - నాయకుడు తన మంత్రదండంతో రంగురంగుల పూలుగా మార్చేస్తాడు!

మైకు గొట్టంలోకి సుతారంగా 'గాలి' ఊది... బోలెడు ప్రాజెక్టులు

పక్షుల్లా ఎగరేస్తాడు!

అచ్చు డ్రైనేజీల్లాంటి బ్యాలట్ బాక్సులని ప్రేక్షకుడికి చూపించి .....

అందులోంచి రకరకాల పథకాలు ముద్రించిన బొమ్మల్ని బైటకి తీస్తాడు!



వేదిక పైకి ఒక అమ్మాయి నిరప్పించి, ఆమెకి 'ఎన్నికల సుందరి' అని పేరు పెడతాడు. ఆమెని నిరాధారంగా గాల్లోకి లేపి ... ఆ తరువాత భయానకంగా ఆమెని . ... ముక్క ముక్కలుగా నరికి పారేస్తాడు1

చక్రవర్తి విస్మయంగా చూస్తూంటాడు.

ఇంద్రజాల నాయకుడు ఈసారి జనం మధ్యకి వచ్చేస్తాడు. ప్రజలంతా చూస్తూండగా తన కళ్ళకి గంతలు కట్టించుకుంటాడు.

ట్రాఫిక్‌లో..... వాగ్దానాల వాహనం పైన పబ్లిగ్గా బ్లయిండ్ రైడ్ చేస్తాడు!

అంతా మైమరిచిపోతారు. ఆశ్చర్యంతో కరతాళ ధ్వనులు చేస్తారు. చిట్టచివరి అయిటమ్‌గా ఇంద్రజాల నాయకుడు - భారతదేశపు ప్రతిష్టాత్మక మాయాజాలం రోప్ మేజిక్ మొదలు పెడతాడు.

నాయకుడు రాగయుక్తంగా ఎలక్షన్ నాదస్వరం ఊదుతూంటాడు.

అంతవరకూ చుట్ట చుట్టుకున్న అదికారం తాడు ... నాదస్వరం వింటూనే పాములాగా నాట్యం చేస్తూ గాల్లోకి లేస్తుంది! తాడు కొస నిరాధారంగా ఆకాశంలోకి వెళ్ళి వేళ్ళాడుతుంది!

అందరూ చూస్తుండగా .. నాయకుడు గాల్లో వేళ్ళాడే తాడుకొసని పట్టుకుని పైకి .. పైపైకి ఎగబాకి ఆకాశంలోకి మాయమైపోతాడు! అంతా తలలు పైకెత్తి, ఆకాశం కేసి వింతగా చూస్తూంటారు.

"ఏడీ? నాయకుడేడీ? మీరు చూశారా? మీక్కనిపించాడా చక్రవర్తి గారూ?"

చక్రవర్తి ఆ ప్రశ్నవైపు చూస్తూంటాడు. అంతలో ఆకాశంలోంచి ఇంద్రజాల నాయకుడు గొంతు సవరించుకుంటాడు. జాతినుద్దేశించి ప్రసంగిస్తాడు.

మేజిక్ రహస్యాలు చెప్పకూడదంటాడు!

ఇప్పట్లో కిందకి దిగిరాలేనని తెగేసి చెప్పేస్తాడు!

ఇంద్రజాలం అనంతంగా సాగుతోనే ఉంది. దేనికీ ఇబ్బంది లేదు. చక్రవర్తి ఈ సుదీర్ఘమైన ప్రదర్శనకి తన కళ్ళని అంకితం చేశాడు. ఒక విసుగూ, విరామం లాంటివేమీ ఉండవు. ఆ కళ్ళ అప్పగింతలకి అంతం అంటూ ఏమీ లేదు. ఊరికినే --- అట్లా వేడి కాఫీనో ... టీనో .. చప్పరించే పద్ధతిలో జరిగే దృశ్యాల్ని కళ్ళతో అలవోకగా సిప్ చేయడమే అతనెరిగిన విద్య!

అసలు ఈ ప్రపంచంలో చూసేందుకే తప్ప

చేసేందుకు ఏమీ లేదని ఎరిగిన జ్ఞాని అతను!

తనేమిటో .... తన కుర్చీ ఏమిటో..... తన చూపులేమిటో ... అంతే. నేను ఎరుగుదును! మీరు అంతగా నిగ్గదీసి ప్రశ్నించినప్పుడు అతన్ని మీకు చూపించకుండా ఎలా ఉంటాను?

మహాకవి పోతనగార్కి నమస్కారం చేశానంటే.. భక్త ప్రహ్లాదుడి లెవెల్లో మీముందు చక్రవర్తిని ప్రత్యక్షం చెయ్యగలను.

"ఏడీ నీ చక్రవర్తి' అంటే నా సమాధానం ఒక్కటే.

"ఇందుగలడందులేడని సందేహము వలదు.

'చక్రి' సర్వోపగతుండు!

మహాశయూ! బాగా పాచిపట్టిన అభివ్యక్తితో చెప్పాలంటే-

అతనొక వ్యక్తికాదు! సమూహశక్తి!

ఆ అద్భుతమైన కుర్చీ అంతరంగిక శరీరభాగంగా కలిగిన అపూర్వ ప్రేక్షకుడెవరో కాదు. నేనే!

నాపేరు చక్రవర్తి. ప్రేక్షక చక్రవర్తి.

మీకు అంతగా నమ్మకం లేకపోతే ఒక ఉదయాన్నే మా ఇంటికి వచ్చి చూడండి.

పెరట్లో.... పారిజాత వృక్షం.. కాస్త దూరంగా వెడల్పాటి సిమ్మెంట్ చెప్టా.. చెప్టా మధ్యలో బోరింగ్ పంప్‌కి తన రెక్కనే అమర్చిన నా భార్య పారిజాతం .....

నా కుర్చీలో కూర్చుని.... ఉదయపు ప్రసారాల్లో మునిగిపోయిన నేను!

పెరటి దృశ్యంనుంచీ ... ప్రపంచ విధ్వంస దృశ్యం దాకా సమస్తమూ 'చూస్తూ'

అనంతంగా నేనే!

'ఆహ్వానం' ప్రచురించే విలువైన క్రొత్తకథల విశ్లేషణలో పాఠకుల్ని, రచయితల్ని పాల్గొనవలసిందిగా కోరుతున్నాం. తమ అభిప్రాయం సంక్షిప్తంగా, సమీక్షాత్మకంగా రాసి పంపితే ఎన్నిక చేసిన వాటిని ప్రచురించటమే గాక 50రూ. పారితోషికం కూడ పంపుతాం. —ఎడిటర్

